# సూపర్–8లో భారత్

**యూఎస్‌ఏపై పోరాడి గెలిచిన టీమ్ ఇండియా ● అర్ష్‌దీప్ పేస్‌కు అమెరికా కుదేలు ● రాణించిన సూర్య, దూబె ● రోహిత్ సేనకు హ్యాట్రిక్ విజయం**

'మినీ ఇండియా వర్సెస్ టీమ్ ఇండియా'గా అభిమానులు అభివర్ణించిన యూఎస్‌ఏ–భారత్ పోరులో రోహిత్ సేన 'కష్టపడి' గెలిచింది. ఆతిథ్య జట్టుకు 'పసికూన' ముద్ర ఇంకా చెరిగిపోకపోయినా, చేసింది తక్కువ స్కోరే (110) అయినా యూఎస్‌ఏ బౌలర్లు రెచ్చిపోవడంతో 'మెన్ ఇన్ బ్లూ'కు విజయం అంత సులభంగా దక్కలేదు. పేస్‌కు అనుకూలిస్తూ బ్యాటర్లకు ఏమాత్రం సహకరించని నసావు పిచ్ (న్యూయార్క్)పై ప్రపంచ స్థాయి బ్యాటర్లు కోహ్లీ, రోహిత్ చేతులెత్తేయగా 'నయా 360' సూర్యకుమార్ యాదవ్ అర్ధశతకంతో ఆదుకున్నాడు. అతడికి అండగా శివమ్ దూబే పోరాటంతో భారత్ ఉత్కంఠ విజయాన్ని నమోదుచేసింది. తొలుత అర్ష్‌దీప్ సింగ్ తన బౌలింగ్‌తో అమెరికాను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. 'లో స్కోరింగ్ థ్రిల్లర్'గా సాగిన ఈ మ్యాచ్‌లో నెగ్గడంతో భారత్ సూపర్ –8కు అర్హత సాధించింది.



సూర్య (50*)
అర్ష్‌దీప్ (4/9)

న్యూయార్క్: వరుసగా మూడు విజయాలతో టీ20 ప్రపంచకప్‌లో భారత్ సూపర్–8కు దూసుకెళ్లింది. యూఎస్‌ఏతో న్యూయార్క్‌లోని నసావు స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై 7 వికెట్ల తేడాతో నెగ్గింది. చేసింది తక్కువ స్కోరే అయినా అమెరికా పోరాడి ఓడింది. 111 పరుగులను ఛేదించేందుకు భారత్ 18.2 ఓవర్లు వేచి చూడాల్సి వచ్చింది. సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 50 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), శివమ్ దూబె (35 బంతుల్లో 31 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన యూఎస్‌ఏ.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (23 బంతుల్లో 27, 2 ఫోర్లు, 1 సిక్స్), స్టీవెన్ టేలర్ (30 బంతుల్లో 24, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్ సింగ్ (4/9) నిప్పులు చెరిగే బంతులతో అమెరికాను కోలుకోనీయలేదు. హార్దిక్ పాండ్యా (2/14) రాణించాడు. అర్ష్‌దీప్ సింగ్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**అర్ష్‌దీప్ అదుర్స్:**

అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై భారత యువ పేసర్ అర్ష్‌దీప్ పేస్ ధాటికి ఆతిథ్య జట్టు ఆదిలోనే కుదేలైంది. ఆ జట్టు ఇన్నింగ్స్ తొలి ఓవర్లో మొదటి బంతికే ఓపెనర్ జహంగీర్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న అర్ష్‌దీప్.. అదే ఓవర్లో చివరి బంతికి ఆండ్రిస్ గోస్ (2)ను ఔట్ చేసి అమెరికాకు డబుల్ షాకులిచ్చాడు. హార్దిక్, బుమ్రా సైతం కట్టడి చేయడంతో అమెరికాకు పరుగుల రాక గగనమైంది. గత రెండు మ్యాచ్‌లలో అమెరికా విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆరోన్ జోన్స్ (11).. హార్దిక్ 8వ ఓవర్లో బౌండరీలైన్ వద్ద సిరాజ్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. 11 ఓవర్లు ముగిసేసరికి ఆ జట్టు చేసింది 48 పరుగులే. ఈ క్రమంలో టేలర్, నితీశ్ వేగంగా ఆడకపోయినా వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. కానీ అక్షర్ పటేల్ 12వ ఓవర్లో మూడో బంతిని లాంగాఫ్ మీదుగా సిక్సర్ బాదిన టేలర్.. ఆ మరుసటి బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. హార్దిక్ 13వ ఓవర్లో 6,4 బాదిన నితీశ్.. అర్ష్‌దీప్ 15వ ఓవర్లో సిరాజ్ చేతికి చిక్కాడు. హార్దిక్ 17వ ఓవర్లో కోరె అండర్సన్ (15)ను బోల్తా కొట్టించాడు. చివరి 6 ఓవర్లలో యూఎస్‌ఏ 3 కీలక వికెట్లు కోల్పోయి 30 పరుగులు మాత్రమే చేయడం గమనార్హం.

**భారత్ పడుతూ లేస్తూ..:**

స్వల్ప ఛేదనలో భారత్ కూడా పడుతూ లేస్తూ లక్ష్యం వైపునకు సాగింది. సౌరభ్ నేత్రవల్కర్ ఆరంభ ఓవర్లలో భారత్‌కు భారీ షాకులిచ్చాడు. ఈ టోర్నీలో వరుసగా విఫలమవుతున్న కోహ్లీ మరోసారి నిరాశపరిచాడు. ఇన్నింగ్స్ రెండో బంతికే కోహ్లీ డకౌట్ కాగా మరుసటి ఓవర్లో రోహిత్ శర్మ (3) హర్మీత్ సింగ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఈ రెండు వికెట్లూ నేత్రవల్కర్‌కే దక్కాయి. 20 బంతులాడి ఓ ఫోర్, ఓ సిక్సర్‌తో 18 పరుగులు చేసిన రిషభ్ పంత్ సైతం అలీఖాన్ 8వ ఓవర్లో క్లీన్ బౌల్డ్ అవడంతో భారత అభిమానులు ఒకింత ఆందోళనకు లోనయ్యారు. ఇదే సమయంలో అమెరికా బౌలర్లు కట్టడిచేయడంతో మిడిల్ ఓవర్స్‌లో భారత్ రన్ రేట్ 4 దాటలేదు. కానీ గత రెండు మ్యాచ్‌లలో విఫలమైన సూర్యకుమార్, దూబె భారత్‌ను ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లు కవ్వించే బంతులు విసిరినా అనవసరపు షాట్ల జోలికి పోకుండా నెమ్మదిగా ఆడారు. 13వ ఓవర్లో 23 పరుగుల వద్ద నేత్రవల్కర్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన సూర్య.. ఆ తర్వాత వేగం పెంచాడు. సాధించాల్సిన రన్ రేట్ పెరుగుతుండటంతో.. అండర్సన్ 15వ ఓవర్లో దూబె భారీ సిక్సర్ బాదాడు. 17వ ఓవర్లో సూర్య 6,4తో భారత్ వంద పరుగుల మార్కును దాటింది. ఈ ఇరువురూ మూడో వికెట్‌కు అజేయమైన 72 పరుగులు జోడించడమే గాక చివరిదాకా క్రీజులో నిలిచి భారత్‌ను సూపర్–8కు చేర్చారు.

**1** **టీ20 వరల్డ్ కప్‌లో అర్ష్‌దీప్ భారత్ తరఫున అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు (4/9) నమోదుచేశాడు. గతంలో అశ్విన్ (4/11) పేరిట ఈ రికార్డు ఉండేది.**

**పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా న్యూయార్క్‌లో ఇప్పటిదాకా ఐదు మ్యాచ్‌లు జరుగగా ఇదే (111) అత్యుత్తమ ఛేదన.**

**సంక్షిప్త స్కోర్లు:**

**యూఎస్‌ఏ:** 20 ఓవర్లలో 110/8 (నితీశ్ 27, టేలర్ 24, అర్ష్‌దీప్ 4/9, హార్దిక్ 2/14). **భారత్:** 18.2 ఓవర్లలో 111/3 (సూర్య 50 నాటౌట్, దూబె 31 నాటౌట్, నేత్రవల్కర్ 2/18, అలీ ఖాన్ 1/21)




## నిత్యకు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరుగుతున్న ఇండియన్ గ్రాండ్ ప్రి–3లో తెలంగాణ యువ అథ్లెట్ గండె నిత్య స్వర్ణ పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 200మీటర్ల రేసును నిత్య..24.23సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచింది. కావేరి (కర్ణాటక, 24.38సె), అభినయ (తమిళనాడు, 24.39సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

## ఆసీస్ అలవోకగా..

నార్త్‌సౌండ్(అంటిగ్వా): టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా సూపర్–8లోకి దూసుకెళ్లింది. బుధవారం నమీబియాతో పోరులో ఆసీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నమీబియా నిర్దేశించిన 73 పరుగుల లక్ష్యాన్ని 5.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 74 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్(34 నాటౌట్), వార్నర్(20) రాణించారు. తొలుత ఆడమ్ జంపా(4/12) ధాటికి నమీబియా 17 ఓవర్లలో 72 పరుగులకు కుప్పకూలింది. మరోవైపు శ్రీలంక, నేపాల్ మధ్య వర్షం కారణంగా బంతి పడకుండానే రద్దయ్యింది. దీంతో గ్రూపు–డీ నుంచి దక్షిణాఫ్రికా అధికారికంగా సూపర్–8లోకి ప్రవేశించింది.

## కలిసి ఆడనున్న నాదల్ -అల్కారజ్

మ్యాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్ అభిమానులకు స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ శుభవార్త చెప్పారు. రాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఈ ఇద్దరూ డబుల్స్ విభాగంలో జోడీ కట్టనున్నారని స్పెయిన్ టెన్నిస్ సమాఖ్య బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నాదల్‌ను ఆరాధించే అల్కారజ్.. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన విషయం విదితమే. ఒక్కొక్కరుగా ఆడితేనే ప్రత్యర్థులను చుక్కలు చూపించే ఈ ఇద్దరూ.. కలిసి ఆడనుండటంతో అది అభిమానులకు కన్నుల పండుగే కానుంది.

## నేపాల్ కబడ్డీ టోర్నీకి శ్రీహాసిని



గంగాధర, జూన్ 12: నేపాల్‌లో ఈ నెల 18న జరిగే అంతర్జాతీయ పోటీలకు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన రావుల శ్రీహాసిని ఎంపికైంది. గ్రామానికి చెందిన లచ్చగౌడ్–జ్యోతి దంపతుల కూతురైన శ్రీ హాసిని చిన్ననాటి నుంచే కబడ్డీలో రాణిస్తున్నది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో ఢిల్లీలో నిర్వహించిన స్టేయిర్స్ యూత్ జాతీయ స్థాయి అండర్–19 బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, నేపాల్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీలకు భారత్ తరఫున ఎంపికైంది. శ్రీహాసినిని తాజా మాజీ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు, గ్రామస్తులు శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు.

## భారత షట్లర్ల శుభారంభం

**ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**



సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో పలువురు తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్–సిక్కిరెడ్డి ద్వయం 21–17, 21–19తో లిమ్–వౌంగ్ (మలేషియా) ను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. పురుషుల తొలి రౌండ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21–10, 23–21 తో కొలెహూ డి ఒలివిర (బ్రెజిల్)ను ఓడించగా కిరణ్ జార్జి 21–17, 21–10తో జియడొంగ్ (కెనడా)ను చిత్తు చేసి రెండో రౌండ్‌కు చేరారు. సమీర్ వర్మ 21–10, 21–10తో (ఆస్ట్రేలియా)ను మట్టికరిపించాడు. మంజునాథ్, రవి, సుబ్రహ్మణ్యన్, అభిషేక్ ఓటమిపాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 21–10, 21–8తో భారత్‌కే చెందిన మొపటిని ఓడించగా ఆకర్షి కశ్యప్ 21–14, 21–11తో పొలిన బురొవ (ఉక్రెయిన్)ను చిత్తుచేసింది. అనుపమ ఉపాధ్యాయ 21–14, 23–21తో వాంగ్ లియాంగ్ (మలేషియా)ను ఓడించింది.

## వివాదాస్పద గోల్‌పై ఫిఫాకు లేఖ

ఢిల్లీ: ఫిఫా వరల్డ్ కప్–2026 క్వాలిఫికేషన్ ఆసియా జోన్‌లో మూడో రౌండ్‌కు ముందంజ వేయాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓడగా.. ఈ మ్యాచ్‌లో ఖతార్ చేసిన వివాదాస్పద గోల్‌పై ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్).. ఫిఫాతో పాటు ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ)కు లేఖ రాసింది. మంగళవారం రాత్రి ఖతార్‌తో జరిగిన మ్యాచ్ 72వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు యూసెఫ్ ఐమెన్ చేసిన గోల్ వివాదాస్పదమైంది. గోల్ లైన్ అవతల పడ్డ బంతిని అందుకున్న యూసుఫ్ గోల్ కొట్టినా రిఫరీ మాత్రం దానిని సరైనదిగానే గుర్తించడంతో వివాదం రాజుకుంది. దీనిపై ఏఐఎఫ్‌ఎఫ్ స్పందిస్తూ.. 'ఖతార్‌తో మ్యాచ్ ఓడటం భారత ఫుట్‌బాల్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. అయితే ఆటలో గెలుపోటములు సహజం. కానీ క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యం. మాకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపించాలని కోరుతున్నాం' అని లేఖలో పేర్కొంది.

## పెళ్లి బాజా మోగనుంది




బాలీవుడ్ అగ్ర కథానాయిక సోనాక్షి సిన్హా పెళ్లి వార్తలు సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు జహీర్ ఇక్బాల్‌తో ఈ భామ కొంతకాలంగా ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ జంట ఈ నెల 23న పెళ్లిపీటలెక్కబోతున్నారని బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. అయితే తన పెళ్లి విషయం గురించి స్పందించడానికి సోనాక్షి సిన్హా నిరాకరించింది. తన తల్లిదండ్రులు కూడా పెళ్లి గురించి ఇంతలా అడగటం లేదని, సమయం వచ్చినప్పుడు తానే అన్ని విషయాలను వెల్లడిస్తానని తెలిపింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ జంట వివాహం నిశ్చయమైనట్లు తెలిసింది. ముంబయి శివారులోని విలాసవంతమైన రిసార్ట్‌లో పెళ్లి జరగనుందని సమాచారం. 'డబుల్ ఎక్స్‌ఎల్' చిత్రంలో ఈ జంట కలిసి నటించారు. ఆ సినిమా సెట్స్‌లోనే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించిందని, గత ఏడాది కాలంగా ఈ జంట ముంబయిలో సహజీవనం చేస్తున్నారని అంటున్నారు. ఇటీవల విడుదలైన 'హీరామండీ' సిరీస్‌తో సోనాక్షి సిన్హా మంచి విజయాన్ని దక్కించుకుంది.

## రెండు వారాల ముందుగా..?





ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతం నేపథ్యంలో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. కాగా ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో ఓ ఆసక్తికరమైన న్యూస్ ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. అనుకున్న సమయానికంటే రెండు వారాల ముందుగానే 'దేవర' ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడని సమాచారం. సెప్టెంబర్ 27కు ఈ చిత్రాన్ని ప్రీపోన్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అదే తేదీకి పవన్‌కల్యాణ్ 'ఓజీ' విడుదల కావాల్సి ఉంది. అయితే షూటింగ్‌లో ఆలస్యం కారణంగా రిలీజ్‌ను వాయిదా వేశారు. ఇప్పుడు అదే తేదీకి 'దేవర' రానుందనే టాక్ వినిపిస్తున్నది. అయితే ఇవి కేవలం ఊహాగానాలు మాత్రమేనని, చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చినప్పుడే ఈ విషయంలో స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

## గోపీచంద్ యాక్షన్ హంగామా



యాక్షన్ హీరోగా ప్రేక్షకుల్లో మంచి ఇమేజ్‌ను సంపాదించుకున్నారు గోపీచంద్. మరోవైపు కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు. బుధవారం ఆయన జన్మదినం. ఈ సందర్భంగా గోపీచంద్ తాజా చిత్రం 'విశ్వం' నుంచి స్పెషల్ బర్త్‌డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ స్పోర్ట్స్‌బైక్ నడుపుతూ స్టైలిష్ లుక్స్‌తో ట్రెండీగా కనిపిస్తున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీనువైట్ల తనదైన మార్క్ యాక్షన్, కామెడీ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, గోపీచంద్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. యాక్షన్‌తో పాటు వినోదాత్మక అంశాలతో ఈ చిత్రం ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని దర్శకుడు శ్రీనువైట్ల తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, సమర్పణ: దోనెపూడి చక్రపాణి, దర్శకత్వం: శ్రీను వైట్ల.

## ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా రాలేదు



'నీ టార్గెట్ టెన్‌మైల్స్ అయితే ఏమ్ ఫర్ ది లెవంత్ మైల్' అని మహేష్‌బాబు సినిమాలో ఓ డైలాగ్ ఉంటుంది. కానీ నేను ట్వెల్త్ మైల్‌కి గురిపెట్టాను. ఓ వినూత్న కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాను' అన్నారు సుధీర్‌బాబు. ఆయన కథానాయకుడిగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హరోం హర'. సుమంత్ జి నాయుడు నిర్మాత. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువహీరోలు విశ్వక్‌సేన్, అడివి శేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మట్లాడుతూ..ఇప్పటివరకు ఇలాంటి బ్యాక్‌డ్రాప్‌లో సినిమా రాలేదని, ప్రతీ షాట్..ఫ్రేమ్ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకొని అత్యుత్తమ సాంకేతికతతో తెరకెక్కించామని, ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని తెలిపారు. తప్పకుండా ప్రతి ఒక్కరికి గుర్తుండిపోయే సినిమా అవుతుందని, ఈ చిత్రాన్ని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అంకితమిస్తున్నానని దర్శకుడు జ్ఞానసాగ్ ద్వారక పేర్కొన్నారు. ఈ కథలో తండ్రీకొడుకుల ఎమోషన్ ప్రతి ఒక్కరిని కదిలిస్తుందని నిర్మాత సుమంత్ జి నాయుడు తెలిపారు. ఇంకా యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

## హృద్యమైన ప్రేమకథ 'ప్రణయ గోదారి'



ప్రముఖ హాస్య నటుడు అలీ సోదరుడి కుమారుడు సదన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక ప్రసాద్ కథానాయిక. ఈ చిత్ర టైటిల్ ఫస్ట్‌లుక్‌ను అంబర్‌పేట శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు పీఎల్ విఘ్నేష్ మాట్లాడుతూ 'సున్నితమైన భావోద్వేగాలతో సాగే హృద్యమైన ప్రేమకథా చిత్రమిది. ప్రేమ ప్రయాణంలోని మధుర భావాలకు అద్దం పడుతుంది. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కూడా ఆకట్టుకుంటుంది. త్వరలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. సాయికుమార్, పృథ్వీ, జబర్దస్త్ రాజమౌళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, దర్శకత్వం: పీఎల్ విఘ్నేష్.

## స్ఫూర్తినిచ్చే కథ ఇది!

సంకల్పబలం ఉంటే జీవితంలోని ఏ దశలోనైనా అనుకున్నది సాధించవొచ్చనే చక్కటి సందేశంతో 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రాన్ని తీశానని చెప్పారు దర్శకుడు శివ పాలడుగు. అజయ్‌ఘోష్, చాందిని చౌదరి జంటగా నటించిన ఈ చిత్రాన్ని హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది.



ఈ సందర్భంగా బుధవారం దర్శకుడు శివ పాలడుగు పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'మా స్వస్థలం విజయవాడ. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే దర్శకత్వం మీద అభిరుచితో డైరెక్షన్‌లో డిప్లొమా కోర్స్ పూర్తి చేశాను. నా స్నేహితులే నిర్మాతలు కావడంతో అవకాశం సులభంగానే దక్కింది' అని చెప్పారు. సంగీతం నేపథ్యంలో 'మ్యూజిక్‌షాప్ మూర్తి' కథ నడుస్తుందని, నాటి తరం గీతాలతో పాటు నేటి ట్రెండీ మ్యూజిక్‌తో పాటలు ఆకట్టుకుంటాయని తెలిపారు. 'పాతికేళ్ల వయసులో సాధించలేని ఓ లక్ష్యాన్ని యాభై ఏళ్ల వయసులో కూడా సాధించవొచ్చనే విషయాన్ని ఈ సినిమాలో చూపించాం. అందుకోసం ఓ వ్యక్తి చేసే ప్రయత్నాలు ఎమోషనల్‌గా సాగుతాయి. అజయ్‌ఘోష్ ఈ పాత్రకు చక్కగా కుదిరాడు. చాందిని చౌదరి పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుంది. సరికొత్త కంటెంట్‌తో ఈ సినిమా తీశాం. తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.